బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి


బలాన్‌పల్లిలో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు: బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని పాపగల్, సిర్సవాడ, బలాన్‌పల్లి, ఐతోల్, గోవిందాయిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు జరిగిన అభివృద్ధి, 2014వ సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమ కోసం సీఎం కేసీఆర్ ఎంతో పాటుపడ్డారని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. గతంలో వ్యవసాయం దండుగ అని రైతులు భావించేవారని ప్రస్తుతం రెండు పంటలకు సాగునీరు పుష్కలంగా అందడంతో వ్యవసాయాన్ని పండగలా చేసుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా లేక రైతులు నానా కష్టాలు పడ్డారని సీఎం కేసీఆర్ రైతుల అవస్థలను గుర్తించి నిరంతరం 24 గంటల కరెంట్‌ను సరఫరా చేస్తున్నారని కొనియాడారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు, రైతులు మరణిస్తే రూ.5 లక్షల రైతుబీమా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్‌దేనన్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులను సరైన సమయంలో అందిస్తున్నామన్నారు. పండించిన పంటను కల్లాల వద్దనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటకు మద్దతుధర ఇస్తున్నామని పేర్కొన్నారు. దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా రైతు ఖాతాలోనే డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి నాగర్‌కర్నూల్‌కు వలస వచ్చి వరి నాట్లు, పత్తి తీస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో గమనించాలని కోరారు. నియోజక వర్గం నుంచి ఇతర ప్రాంతాలను పూర్తిగా వలసలు తగ్గాయన్నారు.

సంక్షేమ పథకాలు ఆదర్శం..

ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ఎ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్య మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇంటింటికి తాగునీరు, పంటలకు సాగునీరు పుష్కలంగా ఇస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసర పింఛన్లు, కేసీఆర్ కిట్, రైతుబంధు, దళితబంధు పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కేఎల్ఐ కాలువల ద్వారా 80 శాతం సాగునీరు అందిస్తున్నామని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మిగిలిన 20 శాతం నీరు ఇస్తున్నామని ఆయన అన్నారు.

గ్యారంటీ పథకాలను నమ్మొద్దు..

కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను నమ్మొద్దని ఎమ్మెల్యే అన్నారు. గతంలో ఎన్నో ఏండ్లుగా పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణను భ్రష్టుపట్టించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగొద్దని ఓటర్లకు సూచించారు. కాంగ్రెస్‌కే గ్యారంటీ లేదని వారి పథకాలను ఎవరు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు.

ఎంజీఆర్ ట్రస్ట్ ద్వారా సేవ

ఎంజీఆర్ ట్రస్టు ద్వార మండల కేంద్రంలోని తాడూరు, సిర్సవాడ, గ్రామాలలో దాదాపు రూ.5 కోట్ల రూపాయలు వెచ్చించి అధునాతన హంగులతో పాఠశాల భవనాలను నిర్మించామన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా 5 రోజుల పాటు పేదింటి ఆడబిడ్డలకు సామూహిక వివాహాలు నిర్వహించామన్నారు. నియోజకవర్గంలో 12వేల మందికి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ప్రచారం..

తెలకపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. ఎమ్మెల్యే సొంత ఖర్చులతో చేసిన సేవ కార్యక్రమాలను వివరించారు.

మరోసారి ఆశీర్వదించండి..

ఇచ్చిన హామీలను అమలు చేశామని మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే మర్రి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో ఎంపీపీ శ్రీదేవీ, నాగం శశిధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలగౌడ్, అనిల్‌రెడ్డి, రాజుగౌడ్, అబ్దుల్లా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బచ్చిరెడ్డి, రాజేందర్, అశోక్, రామలక్ష్మమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఐతోల్‌లో గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు


తెలకపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు


పాపగల్‌లో పాల్గొన్న మహిళలు, కార్యకర్తలు


ఎమ్మెల్యేకు బోనాలతో స్వాగతం పలుకుతున్న గోవిందాయిపల్లి మహిళలు

'మరోసారి ఆశీర్వదిస్తే అండగా ఉంటా'


వల్లభాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వీపనగండ్ల: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పనిచేశానని, మరో మారు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొల్లాపూర్‌ను అభివృద్ధిలో ముందంజలో ఉంచుతానని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం సంపత్‌రావుపల్లి, వల్లభాపురంతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో నియంతలా పాలించిన కొందరు గ్రామాల్లో ఏజెంట్లను పోషించి ప్రజా సమస్యలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో ప్రజా పాలన కావాలా? ఏజెంట్ పాలన కావాలా? ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, సర్పంచ్‌లు అంజయ్యనాయక్, రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కొల్లాపూర్: కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి పరంగా తెలంగాణ మళ్లీ వెనకబాటుకు వెళ్లినట్లే అని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. గురువారం ఆయన కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

వార్డుల్లో..

కొల్లాపూర్ పట్టణంలోని వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సోదరి వీణతో పాటు ఆయన తల్లి బిచ్చమ్మ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వార్డుల వారీగా ప్రచారాలు ముగిసిన అనంతరం వేలాదిమందిలో పట్టణంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

రాజకీయ లబ్ధి కోసమే..

కోడేరు: మండలంలోని ఎత్తం గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే బంధువులపై తప్పుడు ఆరోపణలు చేయడం రాజకీయ లబ్ధి కోసమేనని తీగలపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి చెందిన యువతి కృష్ణవేణి తీగలపల్లికి చెందిన రుషిక్‌కుమార్‌రెడ్డి ప్రేమించుకున్నారు. ఎత్తంలో ఎమ్మెల్యే బంధువు వెంకట్‌రాంరెడ్డి యువతికి ఎవరూ లేక చట్ట ప్రకారం దత్తత తీసుకొని ఏడాది క్రితం కన్యాదానం చేశారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి చెక్కు మంజూరు కాగా.. అది దొంగ చెక్కు అని ఎమ్మెల్యే బంధువు తీసుకున్నాడని ఎత్తం గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు వీడియోలు వైరల్ చేయడం సరికాదన్నారు. పెళ్లికి, దత్తతకు సంబంధించి చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివారెడ్డి, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం మండలంలోని పెద్దమారూర్‌లో ఎంపీపీ సోమేశ్వరమ్మ, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నా. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బీసన్న, లక్ష్మీరెడ్డి, హరికిషన్‌రెడ్డి, ఎండీ మహాదేవ్, శ్రీనివాసులు, చంద్రయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు మాట్లాడుతూ మరోసారి ఎమ్మెల్యేగా హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ రాములు


కొల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న వీణ


పాన్‌గల్‌లో..

నర్సరీల పరిశీలన

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లి నర్సరీని గురువారం ఎంపీడీఓ జయసుధ సందర్శించారు. మొక్కల పెంపకానికి సిద్ధంగా ఉంచిన బెడ్లను పరిశీలించి, వాటిలో నాణ్యమైన విత్తనాలను నాటాలని నిర్వాహకులకు సూచించారు. వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నర్సరీల చుట్టు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.



ఇరువర్గాల ఘర్షణ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం ఘర్షణ పడ్డారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కొల్లాపూర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఉదరు శ్రీనివాసులు కారులో వస్తుండగా అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ కొమ్మ రాజు ఆధ్వర్యంలో ఎర్రగట్టు బొల్లరం దగ్గర అడ్డుకొని దాడి చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఘటన స్థలానికి చేరుకొని కాంగ్రెస్ నాయకులతో ఘర్షణకు దిగారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నిరంతరం అందుబాటులో ఉంటా


పార్టీలో చేరిన వారితో ఎల్లేని సుధాకర్‌రావు


పెద్దకొత్తపల్లి చిన్నకార్పాములలో ప్రచారం నిర్వహిస్తున్న సుధాకర్‌రావు సతీమణి భారతమ్మ

కొల్లాపూర్/పెంట్లవెల్లి/పెద్దకొత్తపల్లి: నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. గురువారం కొల్లాపూర్‌లో బీజేపీ పార్టీ కార్యాలయంలో పాన్‌గల్ మండలం దావాజిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ చంద్రయ్యయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఎల్లేని సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా ఇతర పార్టీ నాయకులను డబ్బులతో కొనుగోలు చేసే పనిలో పడ్డారని విమర్శించారు. అదేవిధంగా కొల్లాపూర్‌తో పాటు పెద్దకొత్తపల్లిలో ఎల్లేని సతీమణి భారతి, కుమార్తె తేజస్విని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట, సింగోటంలో ఎల్లేనిని ఆదరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సింగోటం రామన్న ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శిరీష, సిద్ధార్థ, జలాల్ శివుడు, భీమేశ్వర్ రెడ్డి ఉన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఓ గుర్తుతెలియని వృద్ధురాలు(50) అచేతన స్థితిపడిఉంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైన గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ


సల్కర్‌పేటలో గడపగడప ప్రచారంలో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి/తెలకపల్లి: నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సల్కర్‌పేటలో గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిరంకుశ పాలనకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్యారంటీ పథకాలపై ప్రజలకు నమ్మకం పెరిగిందని వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలకపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కూచుకుళ్లకు మద్దతుగా ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిచరణ్‌రెడ్డి, కొండా నాగేష్, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడి పూజ

కందనూలు: జిల్లా కేంద్రంలోని జెడ్పీ గ్రౌండ్‌లో గురుస్వామి చంద్రయ్య ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. అయ్యప్పస్వాములు భక్తి గీతాలను ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేటలో గురువారం సత్యసాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, మహిళల సామూహిక వ్రతాలు ఆచరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అచ్చంపేటలో కేక్ కట్ చేసి వృద్ధులకు ఉన్ని దుస్తులు అందజేశారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో అన్నప్రసాదం పంపిణీ చేశారు.

ముమ్మర ప్రచారం

● ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదిస్తే సేవకుడిలా పనిచేస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ అన్నారు. గురువారం తెలకపల్లి మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● కోడేరు మండల కేంద్రంలో స్వతంత్ర అభ్యర్థి శిరీష అలియాస్ బర్రెలక్క ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. పేదలకు అండగా ఉంటానన్నారు.

● కొల్లాపూర్ ఎంపీపీ బోజ్యానాయక్ మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

● బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజుకు ఓటమి భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆరోపించారు. లింగాల మండలంలోని వల్లబాపూర్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఉప్పునుంతల మండలంలోని అయ్యవారిపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణకు మద్దతుగా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మోపతయ్య ప్రచారం నిర్వహించారు.

● లింగాల మండలంలోని మానాజీపేట, వల్లభాపూర్, రాంపూర్, బాకారం, కోమటికుంట, దత్తారం, జీల్గుపల్లి, జీల్గుపల్లి తండా, శాయిన్‌పేట, అంబట్‌పల్లి తదితర గ్రామాలలో గువ్వల బాలరాజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

కొల్లాపూర్: పట్టణంలో శుక్రవారం మాదిగలు, ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కోళ్ల శివ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మందకృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా దిలీపాచారి

కందనూలు: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారిని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ గురువారం నియమించారు. ఈమేరకు రాష్ట్ర కార్యాలయంలో ఉత్తర్వులు అందజేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


తాండ్రలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి మాధవిరెడ్డి

కల్వకుర్తిరూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి కసిరెడ్డి మాధవి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాండ్రలో యువజన కాంగ్రెస్ నాయకుడు ఆశాదీప్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు వేసేముందు ఒక్కసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గం అన్నిరంగాల్లో వెనకబడిందని వివరించారు. బీఆర్‌ఎస్ హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దని కోరారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో యువత బుద్ధిచెప్పాలన్నారు. కల్వకుర్తి ప్రాంతానికి సాగునీరు తీసుకురావడంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కీలకపాత్ర వహించారని గుర్తుచేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వార ఈ ప్రాంతానికి సాగునీరు తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారని వివరించారు. ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్సీ కసిరెడ్డికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఎన్నికలు అంటే మూడు రోజుల్లో ముగిసే పండుగ కాదని ఐదేళ్ల భవిష్యత్ అని మాధవిరెడ్డి ఓటర్లకు సూచించారు. మనం ఎవరికి ఓటు వేస్తే బాగుపడుతామో ఆలోచించుకోవాలన్నారు. ప్రజల బాగోగుల కోసం సేవకుడిగా పనిచేస్తున్నావారికి అండగా నిలవాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో తప్పకుండా అమలు చేస్తామన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి మాట్లాడుతూ దళితబంధు, బీసీబంధు, మైనారిటీల బంధు పేరుతో ప్రజలను మోసం చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పలువార్డుల్లో కాంగ్రెస్ నాయకులు కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. అదేవిధంగా పలు గ్రామాల్లో ఏఐసీసీ పర్యవేక్షకుడు మునీర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కల్వకుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న ఏఐసీసీ పర్యవేక్షకుడు మునీర్

మద్యం పట్టివేత

అచ్చంపేట రూరల్/ కల్వకుర్తిరూరల్/ ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు బల్మూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. 42 లీటర్ల ఐఎంఎల్, 31.2లీటర్ల బీరు సీజ్ చేసి మూడు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణ, ఎస్ఐలు బాలరాజు, సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కల్వకుర్తి మండలంలోని ముకురాలలో 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఉప్పునుంతల మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన మూడావత్ చిట్టి నుంచి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

పెద్దకొత్తపల్లి: పట్టణంలోని ఏపీజీవీబీ బ్యాంకులో గురువారం మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సేవలపై వినియోగదారులకు బ్యాంకు మేనేజర్ సంతోష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాషియర్ అరవింద్, ఫీల్డ్ ఆఫీసర్లు సంతోష్, బ్యాంక్ సిబ్బంది సాయి, యూసూఫ్ పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణే ధ్యేయం

అమ్రాబాద్: ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత అని అచ్చంపేట అదనపు సీడీపీఓ కమల అన్నారు. గురువారం మండలంలోని మన్ననూర్ బాలికల రెసిడెన్షియల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీబచావో బేటీపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాలు, ఆరోగ్య భద్రత అవగాహన కల్పించారు.